# దేవుని కవచము

# (6:13-18)

మన భద్రత పడవేయబడిన సమయాన్ని చూచి మనలను పట్టుకోవాలనే అవకాశం కొరకు అపవాది నిరంతరం కనిపెడుతునే ఉన్నాడు. అపవాది కనికరము లేనివాడై యున్నాడు. ఎన్ని జీవితాలను నాశనం చేయడానికి వీలుపడుతుందో అన్నిటిని నాశనం చేసేవరకు వాడు విశ్రమించడు. అపవాది నీ కుటుంబానికి బద్ధ శత్రువు అన్న విషయాన్ని అర్థం చేసికో. తాను మీ మీద పడబోయేదానికి సిద్ధపడియుండు. అలాటిది వస్తుంది. నీవు జీవించినంత కాలం అది వస్తునే ఉంటుంది.

పౌలు ఎఫెసీయులకు యిచ్చే చివరి ఉపదేశం యొక్క అవసరతను యిది వివరిస్తుంది:

> అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తమును నెరవేర్చినవారై నిలువబడుటకును శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు సర్వాంగకవచమును ధరించుకొనుడి. ఏలాగనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని నీతియను మైమరువు తొడుగుకొని పాదములకు సమాధాన సువార్తవలనైన సిద్ధమనస్సను జోడు తొడుగుకొని నిలువబడుడి. ఇవన్నియుగాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను **ఆత్మ** ఖడ్గమును ధరించుకొనుడి. **ఆత్మ**వలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి (6:13-18).

ఆత్మ సంబంధంగా నీవు ఎప్పుడైనా నీ వైరిచే ఎదిరింపబడ్డావా? నీవు నిరాశపడవచ్చు లేదా క్రుంగిపోవచ్చు లేదా ఒక బలమైన శోధన పీడించుతూ ఉండవచ్చు. నీవు నీ నవయువకుడైన బిడ్డను గూర్చి ఆందోళనపడుతూ ఉండవచ్చు: చెడ్డ పనులలోనికి అతని స్నేహితులు వానిని దించ ప్రయత్నిస్తున్నారా? లేక ఆమె స్నేహితులు ఆమెను లైంగికంగా తప్పు చేయ ప్రేరేపిస్తున్నారా? కేవలం నరమాత్రులమైనంత మాత్రానే కొన్ని విషయాలలో ఏకీభావానికి రాలేకపోతున్నామా లేక అపవాది సహవాసాన్ని విరుగగొట్టడానికి ప్రయత్నిస్తున్నాడా? స్థానిక సంఘంలో ఏమి జరుగుతుంది? నీ జీవితం కేవలం కలతతో తప్ప మరేదీ కాకుండా ఉంటే, నీవును నీ చుట్టునున్నవారును క్రిందికి దిగజారినట్టుంటే, నీ ప్రపంచమే విడిపోయినట్టుగా కన్పించితే, నీవు ఆత్మ సంబంధమైన పోరాటంలో ఉన్నావు, శత్రువు నీ పైన పడుతున్నాడు. పౌలు మాటల్లో నీకు శుభవార్త ఉంది. దాని గూర్చి నీవేమైనా చేయవచ్చు. నీవు జయింపగలవు!

దేవునిమీదను ఆయన దయచేయు ఆయుధములమీదను ఆనుకొని లేక ఆధారపడి

క్రైస్తవులు అపవాది యొక్క దండయాత్రలను జయింపవచ్చు.

## పోరాటము కొరకైన ఆయుధములు

ఆత్మ సంబంధమైన యుద్ధానికి ఆత్మ సంబంధమైన ఆయుధములే కావాలి. ఆత్మ సంబంధమైన దండు మీదపడినప్పుడు, తుపాకీలో, భద్రతా బలగమో, లేక నీ కుటుంబాన్ని కాపాడడానికి కరాటే పాఠాలో పనికిరావు. ఆత్మ సంబంధమైన దండు మీదపడడం మన దృశ్యమైన లోకానికిని, భౌతికమైన పరిధికిని దాటిన మరో పరిధికి సంబంధించినదై ఉంటుంది. ఆత్మ సంబంధమైన మన పోరాటం అదృశ్యమైన, ఆత్మ సంబంధమైన శక్తులకు విరోధమైనట్లు పౌలు ఎఫెసీ పత్రికలో రెండు సార్లు ప్రస్తావించాడు. అధ్యాయం 2లో, క్రీస్తులో లేనప్పటి వారి గత జీవితాలను పౌలు తన పాఠకులకు గుర్తు చేశాడు. "మీ అపరాధములచేతను పాపములచేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను. మీరు వాటిని చేయుచు, వాయుమండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైనవారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, యీ ప్రపంచ ధర్మముచొప్పున మునుపు నడుచుకొంటిరి" (2:1, 2). పౌలు యొక్క భావమేమి? తన పాఠకులు ఒకప్పుడు యుద్ధంలో ఓడిపోయే అపవాదివైపున ఉన్నారని అతని భావం.

క్రీస్తునందు, మనం విజయంపొందే వైపుకు చేరుకున్నాం. అంటే దాని అర్థం యుద్ధం అయిపోయిందనా? లేదు, అపవాది యింకను అక్కడ ఉన్నాడు. వానిని గూర్చి నేను పట్టించుకోదలచుకొనకపోతే, వాడు నన్ను జయిస్తాడు. ఏదియెలాగున్నా, నేను దేవుని మాట విన్నట్టయితే, దేవుని బలాన్ని నేను పుంజుకోవచ్చు, అపవాదిని ఓడించడానికి ఆయన కవచాన్ని నేను ధరించవచ్చు.

దేవుని కవచంలో ఏవేవి చేర్చబడియుంటాయి? పౌలు ఆరు వస్తువులను పేర్కొన్నాడు.

**మొదటిది సత్యమను దట్టి**. "ఏలాగనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని ..." స్థిరముగా నిలిచియుండుడి (14ఎ వ.). పౌలు దినాల్లో సైనికుని సామాగ్రిలో బెల్టు ఒకటి, బెల్టు లేక దట్టి రెండు ఉద్దేశాలకు పనికి వస్తుంది: (1) సైనిక గస్తీ తిరిగేటప్పుడు గాని, యుద్ధం చేసేటప్పుడు గాని అతని బట్ట జారకుండ నిలపడానికి పనికి వస్తుంది. (2) అది అతని ఖడ్గాన్ని తన స్థానంలో ఉంచుతుంది. సైనికుడు తన నడికట్టు (బెల్టు) బిగించాడంటే, యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడని అర్థం. తన పని నెరవేర్చడానికి అది చాలిన ధైర్యాన్ని తెలియజేస్తుంది.

అపవాదితో మనం పోరాడేటప్పుడు కూడా – ధైర్యంగా మనం ఆ పని చేయవచ్చు. సత్యంతో ధైర్యం పెనవేయబడుతుంది. సత్యమనేది అటు బోధను, యిటు స్థిర బుద్ధిని సూచిస్తుంది. మనం దేవుని సత్యాన్ని నమ్మడం మాత్రమే గాక, అనుదినం దానిని అనుసరించి జీవించడానికి కూడా బద్ధులమైయున్నాం. దేవుని సత్యాన్ని మనం ప్రకటించడం మాత్రమే గాక, అనుదినం దానిని అనుసరించి జీవించడానికి కూడా బద్ధులమైయున్నాం. దేవుని సత్యాన్ని మనం ప్రకటించడం మాత్రమే గాక, మన జీవితాలు

కూడా దానిని ప్రదర్శించవలసియుంటుంది. సిద్ధాంతపరమైన సత్యంతో దానిని యథార్థంగా అనుసరించడం ఏకమైనప్పుడు అపవాదితో పోరాడే సిద్ధపాటు క్రైస్తవునికి ధైర్యం పుట్టిస్తుంది. వాక్యం ననుసరించి జీవించడానికి మనం యథార్థంగా కృషి చేయవలసి ఉంటుంది.

**సర్వాంగ కవచంలోని రెండవ భాగం, నీతియను మైమరువు** (కవచము) "నీతియను మైమరువు తొడుగుకొని" మనం స్థిరంగా నిలిచియుండాలి (14బి వ.). సైనికుని కవచము ఛాతి భాగాన్ని కాపాడే లోహపు వస్తువైయుంటుంది. దేవుడు మనకు నీతియను కాపుదల నిచ్చాడని పౌలు అంటాడు. మనం దేవునితో నిలిచియున్నామని నీతి తెలుపుతుంది. మనం పాపం చేసి, నిత్య శిక్షకు పాత్రులమైయుండినప్పుడు సయితం, క్రీస్తునందు క్రైస్తవులు నీతిమంతులని దేవుడు ప్రకటించాడు. మనం యిలా చదువుతాం: "మన మాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీ. 5:21).

మనం నీతిగా జీవించ కోరుకోవచ్చు. దేవుని మహిమపరచే విధానంలో మనము జీవింపకోరవచ్చు. అలా అనుదినం కోరుకొనడం, రోజంతా కోరుకొనడం అనేది, మన మార్గంలోనికి అపవాది దేనిని తెచ్చినా, దానినంతటిని దాటి వెళ్లడానికి అది సహాయ పడుతుంది.

**మూడవది, ఆత్మ సంబంధమైన పాదరక్షలు లేక జోడు.** "పాదములకు సమాధాన సువార్తవలనైన సిద్ధమనస్సను జోడు తొడుగుకొని నిలువబడుడి" (6:15). రోమా సైనికులు సగం బూటు, బొటన వేళ్లవద్ద తెరుచుకొనియుండేది వేసికొనేవారు. మడిమెవైపు మేకులు కొట్టబడియుండేవి. నేడు కాలిబంతి ఆట ఆడేవారిలా అది పనికి వచ్చేది. యుద్ధం చేసేటప్పుడు వారు జారిపోకుండా గట్టిగా పట్టియుండడానికి అది పని చేసేది. వారు చేసే యుద్ధాలన్నీ దాదాపు ఒకరికి ఒకరు ఎదురుగా నిలిచి పోరాడే లాటివే. ఆలాటి పరిస్థితుల్లో రోమా సైనికుల బూటుకు ఎక్కువ ప్రయోజనముండేది.

పోరాటంలో వారు పడిపోకుండ నిలిచియుండడానికి క్రైస్తవులు దేవుని యొద్దనుండి సమాధానాన్ని పొందారు. మొదటిది, అది దేవునితో సమాధానానికి సంబంధించింది: "కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము" (రోమా 5:1). దేవుని యొక్క సమాధానం కూడా మనకు ఉంది. అది సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము "యేసుక్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును" (ఫిలిప్పీ. 4:7). దేవునితో సన్నిహితంగా నడుస్తున్నవారికి, క్షేమంగా ఉన్నట్టి భావన కలుగుతుంది. దానిని అపవాది ద్వేషిస్తాడు. మనం నిరంతరం గొడవ పడడం వానికి యిష్టం – యిబ్బందుల్లో ఉండడం వానికి సరదా – అప్పులు కట్టాలనే ఆందోళన, అనారోగ్యంవలన ఒత్తిడి, చేయవలసిన పనులవలన కలిగే తొందర, ఉద్వేగంగా కరిగిపోవడం వానికి యిష్టం. మనకున్న శాంతిని దోచుకోవాలనేది అపవాది వాంఛ. పోరాటాలను ఎదుర్కొనే క్రైస్తవులు దేవుని వద్దనుండి సమాధానాన్ని అందుకొనడం చూస్తే వారిని నిరాశపరచాలనేది అపవాది యొక్క తంత్రమైయుంటుంది.

**నాల్గవది, విశ్వాసమనే డాలు.** "ఇవన్నియుగాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు" (16 వ.). రోమా సైనికుని డాలు పెద్దది. అది దాదాపు సైనికునియంత ఎత్తు, అతనియంత వెడల్పుగా ఉంటుంది. అది అతని పూర్ణంగా కప్పుతూ కాపుదలనిస్తుంది, ప్రత్యేకించి అగ్ని బాణాలను అది నిర్వీర్యం చేస్తుంది. మన విశ్వాసము మనకు ఈ పనిని చేస్తుంది. విశ్వాసము దేవుని ఆజ్ఞలను చేపట్టుతుంది. హానీ చేయడానికి ఎన్ని మీదికి వచ్చినా, మన విశ్వాసం వాటిని నేలను కూల్చుతుంది.

ఇటీవల, కొందరు క్రైస్తవులు కలిసి దేవుని వాగ్దానాలను పఠింపవచ్చారు. తన జీవితంలో తాను అనుభవిస్తున్నదాన్ని బట్టి, వారిలో ప్రతి ఒక్కడు ఒక్కో వాగ్దానాన్ని తీసికొన్నాడు. దేవుని వాగ్దానాలు మన జీవితంలో ప్రతి భాగంకొరకు ఉన్నాయని ఎరగడం బహు ప్రోత్సాహకరంగా ఉంది. అవి వారిని లేవనెత్తాయి, ముందుకు సాగిపోయేలా చేశాయి, దుష్టునినుండి వారిని కాపాడాయి.

**సర్వాంగ కవచంలో అయిదవది, రక్షణయను శిరస్త్రాణం.** "మరియు రక్షణయను శిరస్త్రాణమును ..." (6:17ఎ). తలకు చావు దెబ్బలు తగులకుండ శిరస్త్రాణం కాపాడుతుంది. దేవునినుండి మనకు కలిగిన రక్షణను దేవుడు ఏమంటున్నాడంటే – "నీవు విశ్వాసంవలన జీవించినంత కాలం, అపవాది నిన్ను చావు దెబ్బ కొట్టలేడు. నీ రక్షణను వాడు అపహరించలేడు." నీ రక్షణ విషయంలో నీవు వెనుకకు తిరుగవచ్చును గాని, అపవాది నీ యొద్దనుండి దాని తీసివేయలేడు. రక్షణయను శిరస్త్రాణమును నీకు అనుగ్రహించువాడు దేవుడు. క్రైస్తవుడవుగా, క్రీస్తునందు నీ నిత్యజీవం విషయమై నీవు నమ్మిక కలిగియుండవచ్చు.

**ఆరవది, ఆత్మ ఖడ్గం.** దేవుని యొద్దనుండి అనుగ్రహింపబడే ఆయుధాలలో, "దేవుని వాక్యమను **ఆత్మ** ఖడ్గము" కూడా ఉంది (6:17బి). ఈ ఆరు ఆయుధాలలోను, ఖడ్గమొక్కటే భద్రతకును పోరులో ముందుకు సాగడానికిని ఉద్దేశింపబడింది. దేవుని వాక్యము అట్టిదే. దానిలో రక్షణకును, ఎదిరించడానికిని సామర్థ్యముంది. అరణ్యంలో ఆయన శోధన నెదుర్కొనినప్పుడు, అపవాదికి ప్రభువైన యేసు లేఖనాలను వల్లించినట్టు, శోధనల్లో కాపాడుకొనడానికి దేవుని వాక్యం పనికి వస్తుంది (మత్తయి 4:1–11). సువార్త ప్రకటనలో పోరాటంగా ఆయన వాక్యాన్ని మనం ఉపయోగించుకోవచ్చు. నమ్మువారిని రక్షించడానికి సువార్త దేవుని శక్తియై ఉంది (రోమా 1:16). అంధకార సంబంధమైన అధికారంలోనుండి దేవుని రాజ్యంలోనికి జనులను తెచ్చుటలో మనం దేవుని వాక్యాన్ని వినియోగిస్తాం.

ఈ ఆరింటిని కలిపి దేవుని సర్వాంగ కవచమన్నారు. దేవుడు వాటిని సరఫరా చేస్తాడు. అయితే మనము వాటిని ధరించుకొనవలసియుంటుంది. ఆయన సర్వాంగ కవచాన్ని నీవు ధరించుకొనియున్నావా? రణరంగంలో వీటిని ధరించుకొనియుండడం అత్యవసరం.

దేవునినుండి ఏదీ వెనుతీయకుండ, యథార్థంగా నడిచే నడకనుండి కలిగే ధైర్యంతో నీవు అపవాదిని ఎదిరిస్తున్నావా? దేవుడు వాంఛించినవాటిని కోరుకొంటూ అనుదిన జీవితంలో సాతానుతో యుద్ధం చేయ నీవు సమకట్టావా? దేవుడు సరఫరా చేసే

నెమ్మదికరమైన శాంతితో అపవాది నీ ఉద్వేగాలపై చేసే దాడిని ప్రతిఘటిస్తున్నావా? అపవాది నీ మీద విసిరే దేనినుండైనా నిన్ను కాపాడుకొనడానికి దేవుని వాగ్దానములయందు నీవు నమ్మికయుంచుతున్నావా? నీ రక్షణయందు నీకు నమ్మికయున్నదా? నీ జీవితంలో దానిని ఉపయోగించుకొనునట్లు, దేవుని వాక్యమందు అనుదినము నీవు కాలం గడుపు తున్నావా? దేవుని సర్వాంగ కవచాన్ని నీవు ధరించుకొనియున్నావా? పోరుకు కావలసిన ఆయుధాలను దేవుడు మనకు ప్రసాదిస్తాడు.

## పోరుకొరకైన ప్రార్థన

దేవుడు తన ప్రజలకు ప్రసాదించే ప్రాముఖ్యమైన యింకొక మూలాధారాన్ని పౌలు ప్రస్తావించాడు: "**ఆత్మ**వలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి" (6:18). యుద్ధంకొరకైన ప్రార్థనను దేవుడు మనకు యిస్తాడని పౌలు అంటున్నాడు. ఎందుకు? ఎందుకంటె, దేవుని సర్వాంగ కవచాన్ని ధరించుకొనడానికి ప్రార్థన అవసరం. మనం దేవుని మీద ఆనుకొంటున్నట్టు ప్రార్థన వ్యక్తపరుస్తోంది. ప్రార్థించకపోవడం ఏమంటుందంటే – "నాకు దేవుడు అవసరం లేదు. ఆయన లేకుండా నేను బాగానే చేయగలను. నేను స్వయంగానే చేస్తాను" ఫరవాలేదు అని అంటుంది. ఆలాటి స్వభావం ఆత్మ సంబంధమైన ఓటమిని స్థిరపరుస్తుంది. అపవాదితో జరిగే పోరులో మనలో ఏ ఒక్కడును స్వయంగా పోరాడి జయించలేడు. ప్రార్థన మన దృష్టిని దేవునిపై నిలుపుతుంది.

6:18లో ప్రార్థనను గూర్చిన పౌలు ఉపదేశంలో "సమస్తము" అనేవాటిని గుర్తించు క్రైస్తవులుగా మన జీవితంలో ప్రార్థన ఎంత విస్తృతమయ్యిందో దానిని అతని మాటలు మన దృష్టిని ఆకర్షిస్తున్నాయి – "సమస్తము" అనే పదాన్ని నాల్గుసారులు వినియో గించడంతో యిది జరిగింది.

1. **అన్నివేళల మనం ప్రార్థించాలి.** అపవాదితో పోరాడుతూ సాగిపోవాలంటే, ప్రార్థనను మన దినచర్య క్రమశిక్షణగా చేసికోవాలి.

2. **మనము అన్ని రకాలైన ప్రార్థన విజ్ఞాపనలు చేయాలి.** మన జీవితాల్లో ఏమి జరుగుతుందో దానిని బట్టి రకరకాలైన విన్నపాలను మనం దేవునికి వినిపిస్తుండాలి. పరిస్థితి మన తప్పులు ఒప్పుకొనడానికి, కృతజ్ఞతాస్తుతులు చెల్లించడానికి, విజ్ఞాపనలకు, పూజించడానికి, స్తుతించడానికి, పాడటానికి లేదా మరొక విధమైన ప్రార్థన కల్పింపబడి యుండవచ్చు.

3. **ఎల్లప్పుడు మెలకువగా ఉండి ప్రార్థించాలి.** గెత్సేమనేలో ప్రభువైన యేసు ప్రార్థిస్తుండగా, శిష్యులు నిద్రించారు. ప్రజల యొక్క తత్వం సహజంగా అలాగే ఉంటుంది. మనం నిదురిస్తూ ఉంటాం, లేక మనం ప్రార్థించవలసినప్పుడు ఆ అవసరతను మనం చూడలేకపోతుంటాం.

4. **క్రైస్తవులందరి కొరకు మనం ప్రార్థించాలి.** అపవాదితో చేసే పోరులో మనం

కలసి కట్టుగా పని చేయడం అవసరమన్న సంగతి మనం చూడాలని దేవుడు కోరుకుంటాడు. ఒకరికొరకు ఒకరు ప్రార్థించుకొనే దేవుని ఏక కుటుంబం అపవాది దాడులకు వ్యతిరేకంగా బలంగా నిలుస్తుంది.

నేను ప్రార్థించవలసినట్టుగా ప్రార్థించడానికి గత సంవత్సరాలలో నేను సతమత మయ్యాను. ప్రార్థించడంలో తప్పిపోయిన యితర క్రైస్తవులు తమ లోపాలను నాతో పంచుకున్నారు. ప్రార్థన విషయానికి వచ్చేటప్పటికి మనం ఎందుకు తప్పిపోతాం? దీని విషయమై పలు కారణాలను మనం ఆలోచింపవచ్చునని నాకు తోస్తుంది. కాని వాంఛించు దేవుడు అనే తన రచనలో జాన్ పైపర్ ప్రస్తావించిన సంగతులను చూద్దాం.

> నేను తప్పుగా అర్థం చేసికొనకపోయినట్టయితే, దేవుని పిల్లలలో అనేకులకు చెప్పుకోదగ్గ ప్రార్థనా జీవితం లేకపోవడానికి కారణం, ప్రార్థించాలనే కోర్కె లేకపోవడం కాదు, కాని ప్రార్థించడానికి మనకు ప్లాన్ లేకపోవడమే. నాల్గు వారాలు నీవు సెలవు తీసికోగోరినట్టయితే, ఒక వేసవి ఉదయాన కేవలం నీవు మేల్కొని, "హే, మనం ఈ రోజు వెళ్లదాం!" అని నీవు చెప్పవు. నీకు ఏమీ సిద్ధంగా లేదు. ఎక్కడికి వెళ్లాలో నీకు తెలియదు, ఏ ఏర్పాటు చేసికోలేదు.
>
> అయితే మనలో ఎక్కువమంది ప్రార్థనను అలాగే భావిస్తారు. రోజు వెంట రోజు మనం మేల్కొంటునే ఉంటాం, ప్రాముఖ్యమైన ప్రార్థన సమయాలు మన జీవితంలో భాగమైయుండాలని మనం గుర్తిస్తాం, అయితే ఏదీ ఎప్పుడు సిద్ధంగా లేదు. ఎక్కడికి వెళ్లాలో మనకు తెలియదు. ఏదీ ప్లాన్ చేసికోలేదు. సమయం లేదు. స్థలంలేదు. విధానం లేదు. లోతైన, తనంతట అది పొర్లి వచ్చే ప్రార్థనా అనుభవాలు ప్లానింగ్ లేకుండా కలుగవని మనకు తెలుసు. ప్లానింగ్‌కు వ్యతిరేకమైనది అలవాటుపడిన పద్ధతియై ఉంటుంది. నీవు నీ సెలవు దినాలకు ప్లాన్‌వేసికొనకపోతే, యింటి వద్ద కూర్చుండి T. V. చూస్తు ఉండవచ్చు! ప్లానులేని ఆత్మ సంబంధమైన జీవితపు ప్రవాహం శక్తి యొక్క కడపటి అంచుకు వచ్చి చేరుకుంటుంది. పరుగెత్తవలసిన పందెముంది మరియు పోరాడవలసిన యుద్ధముంది. నీ ప్రార్థనా జీవితంలో నూతనత్వం కావాలని నీవు కోరుకుంటే, దాన్ని చూడడానికి నీవు ప్లాన్ వేసికోవాలి.
>
> గనుక, నా చిన్న హెచ్చరిక యిది: కేవలం ఈ రోజే మన ప్రాధాన్యతలను గూర్చి తిరిగి ఆలోచించి, వాటిలో మన ప్రార్థన ఎలా తగియుంటుందో చూడు. కొంత నూతన తీర్మానాన్ని చేసికో. దేవునితో నూతన సాహసానికి పూనుకో. సమయాన్ని నిర్ణయించుకో, స్థలాన్ని నిర్ణయించుకో నిన్ను నడిపించడానికి ఒక లేఖన భాగాన్ని ఎన్నుకో. విరామం లేని దినాలచే నియంతృత్వం చేయబడకు. మధ్య మార్గపు దిద్దుబాట్లు మనకందరికి అవసరమే. దేవుని మహిమకొరకును, నీ సంపూర్ణ సంతోషంకొరకును ఈ దినం ప్రార్థనవైపు తిరిగే దినంగా చేసికో.[1]

## ముగింపు

అపవాదితో పోరాడడానికి నీవు ఏ చర్యలు తీసికొంటావు? ఆత్మ సంబంధమైన దాడి నీ కుటుంబం మీదికి జరిగినప్పుడు, వారి కాపుదలకు నీవు ఏమి చేయబోతావు? అంధకార సంబంధమైన శక్తులకు విరోధమైన "కడమట్టుకు జరిగే పోరులో" జయ మొందుటకు నీ తోటి క్రైస్తవులకు నీవు ఎలా సహాయం చేయగలవు?

నీ జవాబు అపొస్తలుని మాటల్లో కనుగొనవచ్చు:

సిద్ధపడియుండు. నీ సొంతగా చేపట్టగలదానికంటె ఎక్కువైన దానికి వ్యతిరేకంగా నీవు నిలిచియున్నావు. దేవుడిచ్చే ప్రతి ఆయుధాన్ని, నీవు పొందగల సహాయమంతటిని తీసికో. కేక తప్ప మిగిలినదంతా అయిపోయినప్పుడు, నీవు యింకను నీ పాదాలమీదనే నిలిచియుండేలా. సత్యము, నీతి, సమాధానము, విశ్వాసము మరియు రక్షణ అనేవి మాటలకంటె మిన్నయైనవి. వాటిని ఎలా వర్తింపజేసికోవాలో నేర్చుకో. నీ జీవిత మంతటను అవి నీకు అవసరమైయుంటాయి. దేవుని వాక్యము తప్పని సరియైె ఉంది. అలాగే, కొనసాగే ఈ రణరంగంలో ప్రార్థన అవసరమై ఉంటుంది. ప్రార్థన బలంగాను దీర్ఘంగాను చేయి. నీ సహోదర సహోదరీలకొరకు ప్రార్థించు. నీ కన్నులు తెరిచియుంచు. ఎవరును వెనుకబడకుండ లేక పడిపోకుండ ప్రతి ఒక్కరి ఆత్మలను మేల్కొలిపియుంచు (6:13–18; TM).

---

సూచనలు

[1]John Piper, *Desiring God* (Portland, Oreg.: Multnomah, 1986), 150-51, quoted by R. Kent Hughes, *Ephesians: The Mystery of the Body of Christ* (Wheaton, Ill.: Crossway Books, 1990), 257-58.

## యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండు

"నేడు 'సజీవుల భూమిలో' కలతను తొందరపాటును మనం చూస్తున్నాం. నేరం భయంకరంగా అధికమౌతుంది. జీవన మూల్యము పెరుగుతుంది. మనుష్యుల హృదయాలు నేడు భయంతో నింపబడుతున్నాయి."

"దావీదు దినాల్లో సహితము భయం కలిగించే పరిస్థితులు ఎక్కువగానే ఉన్నాయి. లోకాన్ని ఎవరు చేసి ఎవరి ఆధీనంలో ఉంచుకున్నాడో ఆయనవైపు తేరి చూడడానికి గాను లోకపు పరిస్థితులనుండి దృష్టి మళ్ళే విశ్వాసం లేనట్టయితే తాను సొమ్మసిల్లిపోయి ఉంటానని అతడన్నాడు. సూర్యుడు ఉదయించి అస్తమించడం ఎంత నమ్మకముగా జరుగుతుందో దేవుని 'మంచితనం' అంత నమ్మకముగా ఉన్నట్టు అతడు చూచాడు. ప్రకృతిలో దేవుని 'మంచితనాన్ని' అతడు చూచాడు. దేవుని 'మంచితనము' ఆయన 'విశ్వాస్యత' తన సొంత పిల్లలకు యిది జ్ఞాపకం చేయునదైయుంది. తన పరలోకపు తండ్రిమీద దావీదు యొక్క నమ్మిక అది లోతైనదిగా (గాఢంగా) చేసింది."

"ఈలాటి లోకంలో జీవించడానికి కావలసిన బలము, ధైర్యముకొరకైన రహస్యాన్ని కీర్తన రచయిత – ఓ చిన్న నాల్గు పదాలలో 'యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండు' అని అంటున్నాడు. కనిపెట్టుకొనియుండే సామర్థ్యం అంత తేలికగా పొందగలిగేది కాదు. మనం విశ్రాంతి లేనివారమై కదిలిపోవాలని కోరికగలవారమైయున్నాం. లైన్లో నిలబడ డానికి మనం యిష్టపడం లేక డాక్టర్ క్లినిక్ వద్ద వేచియుండ నిష్టపడం – వాస్తవానికి, మనలో అనేకులం కనిపెట్టుకొనియుండ నిష్టపడం. వేచియుండడం కంటె పని (కార్యం) చేయడం సులభం. 'దేవుని మీద ఆనుకొనడం అంతరిక్ష యుగంలోని సరాసరి క్రైస్తవుని గురుతైయుండదు' అని ఎవరో ఒకరన్నారు."

యెహోవా కొరకు కనిపెట్టుకొనడం అనేది మన జీవితాలలో ఆయన దిక్చూపు కొరకు, నడిపింపుకొరకు ఆయన ముఖదర్శనం చేసికోగోరడమైయుంటుంది. ఆయన ఎదుట – ఆయన సన్నిధిలో ఆయన స్వరం (వాక్యమందు) వినడమే పూర్తిగా సరిపోయి నట్టౌతుంది. మనం ఆయన కొరకు కనిపెట్టుకొనకపోతే, శరీరము యొక్క బలాన్ని బట్టి వెళ్లే అవకాశముంది; లేదా ఆయన కాలానికి ముందుగా మనం ద్వారం బలవంతంగా తెరిచే అవకాశముంది.

"యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండు! ఆయన గడియారము ఆయన క్యాలండరు ఎల్లప్పుడు మన వంటివిగా ఉండవు, అయితే అవి ఎల్లప్పుడు సమయం ప్రకారమే ఉంటాయి."

> "సజీవుల దేశమున నేను యెహోవా దయను పొందుదునన్న నమ్మకము నాకు లేనియెడల నేనేమవుదును? యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము. ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగానుంచుకొనుము యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము" (కీర్తన. 27:13, 14; KJV).

ధ్యాన సమయాలు
Millie Stamm